
సాక్షి ఒడిశా

బుధవారం । 13 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.2,81,887
బంగారం	1 గ్రాము 900 మిల్లీ గ్రాములు
వెండి	1 గ్రాము 900 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



రాష్ట్రంలో 274 రైల్వే ప్రాజెక్టులు ప్రారంభం

ఒడిశాలో 274 రైల్వే ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభం కార్యక్రమం మంగళవారం జరిగింది.

- 8లో

నబరంగ్‌పూర్ జిల్లాలో దారుణం



చేతబడి చేసిందనే అనుమానంతో వృద్ధురాలిని దారుణంగా హత్య చేసిన అమానుష ఘటన నబరంగ్‌పూర్ జిల్లాలో చోటుచేసుకుంది.

- 8లో

న్యూస్‌రీల్

రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు



సిద్ధమైన వాహనం

రాయగడ: వేటగాళ్ల బారి నుంచి వన్య ప్రాణులను రక్షించడంతో పాటు ప్రమాదంలో ఉన్న వాటిని కాపాడి ప్రాథమిక వైద్యం అందించేందుకు జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటయ్యింది. ఈ టీమ్ వివిధ ప్రాంతాల్లోని అడవుల్లో పర్యటించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక వాహనాన్ని సిద్ధం చేసింది. రెండు రోజుల క్రితం ఈ వాహనం స్థానిక అటవీ శాఖ కార్యాలయానికి చేరుకుంది. ఈ టీమ్‌లో ఒక అటవీ శాఖ అధికారితో పాటు ఒక ఫారెస్టర్, మరో నలుగురు సిబ్బంది ఉంటారు. జిల్లాలోని కాసీపూర్, టికిరి, మునిగుడ, గుడారి, గుణుపూర్, కల్యాణసింగుపూర్, రాయగడ అటవీ ప్రాంతాల్లో ఆపదలో ఉన్న వన్యప్రాణులను సంరక్షించి వాటికి తగు సమయంలో చికిత్స అందించేందుకు ఈ టీమ్ అందుబాటులో ఉంటుందని సంబంధిత అటవీ శాఖ రాయగడ రేంజ్ అధికారి అశోక్ కుమార్ ప్రధాన్ తెలియజేశారు.

ఇద్దరు దోపిడీ దొంగలు అరెస్టు



అరెస్టైన దొంగలను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరంలో ఇటీవల వరుసగా జరుగుతున్న దొంగతనాలకు సంబంధించి ఇద్దరు దోపిడీ దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి బసంత్ కుమార్ సెఠి తెలిపిన వివరాల మేరకు.. నిమ్మఖండి పోలీసుస్టేషన్ పరిధిలో కొద్ది రోజులుగా వరుసగా దొంగతనాలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 10 మోటార్లు, బ్యాటరీ స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో జిల్లాకి చెందిన సోను నాయక్, కిచన్ మామ ఉన్నట్లు గుర్తించారు.

కరుడుగట్టిన నేరస్తుడు అరెస్టు



అరెస్టైన మనోజ్ డంగువాని

బరంపురం: గంజాం పోలీసు జిల్లా పరిధి బెంగునియపడా పోలీసులు కొద్ది రోజులుగా తప్పించుకొని తిరుగుతున్న కరుడుగట్టిన నేరస్తుడు మనోజ్ డంగువాని అరెస్టు చేశారు. గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీన తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం ఉదయం జిల్లాలోని బెంగునియపడా పోలీసుస్టేషన్ పరిధిలో దోపిడీకి సిద్ధమవుతున్న మనోజ్ డంగువాని అరెస్టు చేశారు. అతడి వద్దనుంచి 1 తుపాకీ, రెండు కత్తులు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న తుపాకీ

ఎండిన నది



పర్లాకిమిడి వద్ద ఎండిపోయిన మహేంద్రతనయ నది

గత ఆరు నెలలుగా గజపతి జిల్లాలో వర్షాలు లేకపోవడంతో మహేంద్ర తనయ నది ఎండిపోయింది. ఈ ఏడాది మార్చి మొదటి వారం నుంచే ఉష్ణోగ్రతల్లో పెరుగుదల కనిపిస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. నది ఎండిపోవడంతో చెత్త, గుర్రపు డెక్కతో నది వంతెన దర్శనమిస్తోంది. అలాగే నదిలో నీరు ఇంకిపోవడంతో ఒక్కపూట మాత్రమే పర్లాకిమిడి ప్రజలకు తాగునీటిని కుళాయి ద్వారా అందజేస్తున్నారు. అలాగే సాగునీరు లేకపోవడంతో వందిలాది ఎకరాలకు ఇబ్బందులు తప్పేలా లేవని స్థానికులు పేర్కొంటున్నారు.

– పర్లాకిమిడి



గుర్రపు డెక్క, చెత్త పేరుకుపోయిన దృశ్యం



పాతపట్నం రోడ్డులో అడుగంటిన నీరు

కాంగ్రెస్‌లో పదవుల పందేరం



బుల్లు సాహు



రుపక్ తురుక్



జగదీష్ ఖోస్లా

కొరాపుట్: జిల్లా కాంగ్రెస్‌లో పార్టీ సీనియర్ నాయకులకు పదవుల పందేరం జరిగింది. అందుకు తగ్గ ఆదేశాలను ఆ పార్టీ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ సోమవారం విడుదల చేశారు. పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా దుర్గా శంకర్ సాహు(బుల్లు)ని నియమించారు. బుల్లు ఇదివరకు కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశాడు. మరో జనరల్ సెక్రటరీగా జగదీష్ ఖోస్లాని నియమించారు. జగదీష్ చాలా కాలంగా పార్టీకి విధేయుడిగా కొనసాగుతున్నారు. అలాగే కొరాపుట్ పట్టణానికి చెందిన రుపక్ తురుక్‌ని రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. రుపక్ గతంలో యువజన కాంగ్రెస్, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ విభాగాల్లో పనిచేశారు. వీరందరూ ప్రస్తుత కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్కకి వీర విధేయులు కావడం గమనార్హం. కొరాపుట్ జిల్లా కాంగ్రెస్‌లో రెండు వర్గాలు ఉన్నాయి. ఒక వర్గానికి ఎంపీ సప్తగిరి నేతృత్వం వహిస్తుండగా, మరో వర్గానికి జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి నేతృత్వం వహిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతుండడంతో వీరంతా సమష్టిగా ఎలా పనిచేస్తారో చూడాల్సి ఉంది.

మరోసారి అస్వస్థతకు గురైన కమల పూజారి

జయపురం: పద్మశ్రీ అవార్డు గ్రహీత కమల పూజారి మరోసారి అస్వస్థతకు లోనయ్యారు. వెంటనే ఆమెను జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్చారు. హాస్పిటల్ డాక్టర్లు ఆమెను పరీక్షించించి మెరుగైన వైద్యం కోసం కటక్ శ్రీరామ చంద్ర భంజ్ ఆస్పత్రికి తరలించారు. 80 ఏళ్ల వయస్సు కలిగిన కమల పూజారి కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. కొద్ది నెలల క్రితం ఆమె కటక్ శ్రీరామ చంద్ర భంజ్ ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె జయపురం సమితి డొంగరచించి గ్రామ పంచాయతీ పాత్రోపుట్‌లో నివసిస్తున్నారు. ఆమెకు వైద్యాధికారులు తరచూ వైద్య పరీక్షలు జరుపుతున్నారు. సోమవారం మధ్యాహ్నం డొంగరచించి ఏఎన్ఎం బాలేశ్వరి శాంత కమల పూజారికి వైద్య పరీక్షలు జరిపేందుకు వెళ్లారు. పరీక్షల్లో ఆమె అస్వస్థతతో ఉన్నట్లు గుర్తించారు. దీంతో వెంటనే జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్చారు. హాస్పిటల్ వర్గాలు ఈ విషయం జయపురం సబ్ కలెక్టర్ ప్రబాత్ కుమార్ పరిడ, కొరాపుట్ కలెక్టర్ వి.కీర్తి వాసన్‌కు తెలియజేయగా, వారు కటక్ హాస్పిటల్ అధికారులతో మాట్లాడారు. అనంతరం అంబులెన్స్‌లో కటక్ పంపినట్లు అధికారులు వెల్లడించారు. ఆమెతో పాటు ఒక హెల్త్ వర్కర్, ఆమె కుమారుడు, మరో బంధువు వెళ్లారు.



కమల పూజారిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఈనెల 26 నుంచి తరతరణి ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివ్యజ్యోతి పరిదా

బరంపురం: దక్షిణ ఒడిశా ఆరాధ్య దేవత, గంజాం జిల్లా ఇలవేల్పు, పురుషోత్తపురం దగ్గర రూశికుల్యా నదీతీరం పక్కనున్న కొండపై వెలసిన తరతరణి అమ్మవారి చైత్రమాస ఉత్సవాలను ఈనెల 26వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా తెలియజేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రం ఛత్రపూర్‌లోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన తరతరణి ఆలయ అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 26 నుంచి ప్రారంభమై మొత్తం ఐదు మంగళవారాల్లో ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు దక్షిణ ఒడిశాతో పాటు ఆంధ్రప్రదేశ్, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాల నుంచి మొత్తం 30 లక్షలకి పైగా భక్తులు రానున్నట్లు వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం వసతి గృహాలు, తాగునీరు, ఆరోగ్య శిభరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కొండపై మద్యం, పాలిథిన్ నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు జిల్లా కలెక్టర్ సరోజ్ కుమార్ మిశ్రా, ఏఎస్పీ అజయ్ ప్రతాప్ స్వంయి, ఎస్‌డీపీవో దిలీప్ కుమార్ దాస్, ఆలయ అభివృద్ధి కమిటీ బోర్డు కార్యదర్శి ప్రమోద్ కుమార్ పండా, ఎగ్జిక్యూటివ్ అధికారి టి.కె.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొండపై కొలువై ఉన్న తరతరణి అమ్మవారు

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



దివ్యాంగులతో మంత్రి సరక, ముదులి తదితరులు

రాయగడ: స్థానిక సమితి కార్యాలయ ప్రాంగణంలో దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక ముఖ్య అతిథిగా హాజరై దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే వీల్‌చైర్లను అందజేశారు.

జిల్లా సామాజిక సురక్షా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయా మాఝి తదితర సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మరో ముగ్గురు దివ్యాంగులకు సీపీ వీల్‌చైర్లు, 46 మందికి చేతికర్రలను, అదేవిధంగా ఆరుగురికి వినికిడి యంత్రాలు, 4 స్మార్ట్‌ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సరక మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వారికి అవసరమైన ఉపకరణాలను పంపిణీ చేయడంతో పాటు వారి ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు దివ్యాంగులకు సక్రమంగా చేరేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల మహాసంఘం కార్యదర్శి అమరేంద్ర నాథ్, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శుభ్ర పండ, సమితి వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుక తదితరులు పాల్గొన్నారు.

వేసవి తాపాన్ని ఎదుర్కొనేలా చర్యలు

- రాయగడ కలెక్టర్ మహాజన్



మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్ పక్కనే రైతా, కుహరోలు

రాయగడ: జిల్లాలో వేసవి తాపాన్ని ఎదుర్కొనేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ ఆదేశించారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వడదెబ్బపై అవగాహన కలిగేలా అధికారులు చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో వేసవి తీవ్రత మరింత అధికంగా ఉంటుందన్నారు. ఇప్పటికే వేసవి వడగాలులు ప్రజలను అతలాకుతలం చేస్తున్నాయని పేర్కొన్నారు. అందువల్ల వడదెబ్బ బారి నుండి ప్రజలను కాపాడే విధంగా జిల్లా వైద్య శాఖ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ బాధితులకు అందేలా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ప్రత్యేకంగా వార్డును ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో తగు సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

తాగునీటి సౌకర్యాలు కల్పించాలి

గ్రామీణ ప్రాంతంలో నీటి ఎద్దడి ప్రాంతాలను గుర్తించి, అక్కడ తాగునీటి సౌకర్యాలు మెరుగుపరచాలని సూచించారు. మరమ్మతులకు గురైన గొట్టపు బావులను తక్షణమే బాగుచేసి ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా సౌరశక్తితో నడిచే మంచినీటి బావులు పనిచేసేలా గ్రామీణ నీటి సరఫరా శాఖ చర్యలు తీసుకోవాలన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేవిధంగా ప్రజలు కూడా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు తమతో పాటు మంచినీటి బాటిల్ తీసుకొని వెళ్లాలని సూచించారు. ఒకవేళ వడదెబ్బ తగిలితే తక్షణమే సమీపంలోని ఆస్పత్రిలో సకాలంలో వైద్యం చేయించుకోవాలన్నారు. ఇటువంటి చిన్న తరహా విషయాలను విస్మరిస్తే ఆపదలు కొనితెచ్చుకునే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఏడీఎం భాస్కరరైతా, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో తదితరులు పాల్గొన్నారు.

రాయగడ-సింగపూర్ రైల్వే లైన్ ప్రారంభం



వేదికపై మకరంద ముదులి, శివపట్నాయక్, మాఝి తదితరులు

రాయగడ: విజయనగరం నుంచి టిట్లాఘడ్ వరకు జరుగుతున్న రైల్వే పనుల్లో భాగంగా రాయగడ నుంచి సింగపూర్ రోడ్డు వరకు పూర్తయిన మూడో రైలు మార్గాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు. సుమారు 9.2 కిలోమీటర్ల పొడవున ఉన్నటువంటి ఈ కొత్త మార్గం నిర్మాణానికి సుమారు రూ.167 కోట్లు వెచ్చించారు. స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఈ మేరకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గౌరవ అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, ఎస్సీ, ఎస్టీ మోర్చా రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాళీరాం మాఝిలు హాజరయ్యారు. అదేవిధంగా వన్ స్టేషన్ వన్ ప్రొడక్టుకు సంబంధించి ఏర్పాటు చేయనున్న స్టాల్‌కు పీఎం మోదీ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న విశాఖపట్నం డివిజనల్ ఆపరేషన్ మేనేజర్ ప్రీతీ రాణా మాట్లాడుతూ 9.2 కిలోమీటర్ల రాయగడ-సింగపూర్ రోడ్డు రైలు మార్గంలో రైలు ప్రయాణాలు కొనసాగుతాయని తెలియజేశారు.

ఐదుగురు జూదరులు అరెస్టు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎంవీ 19 గ్రామంలో జూదమాడుతున్నట్లు మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండోకు మంగళవారం ఉదయం సమాచారం వచ్చింది. దీంతో తన సిబ్బందితో కలిసి గ్రామంపై దాడి చేసి ఒక చోట జూదమాడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. కాగా మరికొంతమంది పరారయ్యారు. పట్టుబడిన నిందితుల నుంచి రూ.8,030 నగదు, ఆట సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. విచారణ అనంతరం కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు.



అరెస్టైన నిందితులు

కుటింగిగుడ వంతెన ప్రారంభం



వంతెన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముదులి

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ కుటింగిగుడలో సుమారు రూ.3.67 కోట్ల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జిని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి సోమవారం సాయంత్రం ప్రారంభించారు. కొద్ది నెలల క్రితం బ్రిడ్జి పనులు పూర్తైనా, అప్రోచ్ రోడ్డు పనులు పూర్తవ్వలేదు. అయితే ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో వంతెనను ప్రారంభించారు. అయితే త్వరితగతిన వంతెన అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. అయితే వంతెన నిర్మాణంలో చోటు చేసుకున్న జాప్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చర్చించగా ఎట్టకేలకు వంతెన నిర్మాణ పనులు పూర్తి చేశారు. వంతెన ప్రారంభంతో సుమారు 16 గ్రామాలకు చెందిన ప్రజలకు రాకపోకలకు మార్గం సుగమమయ్యింది.

క్లుప్తంగా

భక్తి గీతాలతోనే గుర్తింపు



కారుణ్యకు జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణమాచార్యులు, శంకరశర్మ

అరసవల్లి: సినీ సంగీత ప్రపంచంలో భక్తి గీతాలాపన చేసే గాయకులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ప్రముఖ సినీ గాయకుడు ఎస్.సి.కారుణ్య అన్నారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామిని మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనివేటి మండపంలో ఆదిత్యున్ని కీర్తిస్తూ పలు కీర్తనలు, భక్తిగీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా కారుణ్య మాట్లాడుతూ ఆదిత్యుని సన్నిధిలో గీతాలాపన చేయడం అదృష్టమన్నారు. ఖలేజా సినిమాలో 'ఓం నమో శివ రుద్రాయ...ఓం నమో స్థితి కంఠాయ..' అనే పాటకు అద్భుత స్పందన లభించి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఆలయ విశిష్టతను, పర్వదినాల విశేషాలను అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ వివరించారు.

ప్రతి పంచాయతీలో గొర్రెల పెంపకందారుల సంఘాలు



మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ చిన్నారావు యాదవ్

నందిగాం: జిల్లాలో ప్రతి పంచాయతీలోనూ గొర్రెలు, మేకల పెంపకదారుల సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా గొర్రెలు, మేకల పెంపకదారుల సహకార సంఘ సమాఖ్య చైర్మన్ రాపాక చిన్నారావు యాదవ్ అన్నారు. నందిగాం మండలం కవిటి అగ్రహారంలో మంగళవారం గొర్రెల, మేకల పెంపకదారుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. కవిటి అగ్రహారం సచివాలయంలో సర్పంచ్ బొమ్మాళి వరలక్ష్మి గున్నయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ అధ్యక్షుడిగా ఐతి తిరుపతిరావు, ఉపాధ్యక్షుడిగా బంగారు కృష్ణారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిట్ట రామారావు, గురుదాసుపురం సంఘ అధ్యక్షుడు పానిల కృష్ణారావు, జయరామచంద్రపురం అధ్యక్షుడు లొడగల అప్పారావు, అఖిలభారతీయ యాదవ కుల యువజన అధ్యక్షుడు డొక్కరి దిలీప్‌కుమార్, బందాపు తిరుమల, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

మందస: ప్రతిఒక్కరూ సత్ప్రవర్తనతో మెలిగినప్పుడే నేరాల సంఖ్య తగ్గుతుందని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. మందసలో మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరాల అదుపు చేయడానికి పోలీసులు కృషి చేస్తుంటారని, వారికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం గురుదేవ ఛారిటబుల్ ట్రస్టు(విజయనగరం) సహకారంతో మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందజేశారు. జెమ్స్ వైద్యులు శ్రీనివాసరావు, దివ్య, శివమణిసాయి, విజయ్ కుమార్, శ్రీహర్ష 250 మంది వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రేమ్‌కాజల్, డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి, సీఐ పి.ఈశ్వరరావు, మందస ఎస్ఐ బి.అనిల్‌కుమార్, జెమ్స్ మేనేజర్ బి.చిన్నారావు, ఏరియా మేనేజర్ రాపాక తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో సంప్రోక్షణ పూజలు



శ్రీముఖలింగం ఆలయంలో సంప్రోక్షణ పూజలు చేస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలు అనంతరం మంగళవారం ఉదయం సంప్రోక్షణ, శుద్ధి, పుణ్యాహవచన పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు, అధికారులు పుణ్యతీర్థాల నదుల జలంతో పాటు పంచగవ్యతో శుద్ధి చేశారు. ఉదయం ఈ సంప్రోక్షణ పూజలు పూర్తి చేసి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు దర్శనాలకు అనుమతి ఇచ్చారు. శివరాత్రి ఉత్సవాలు, చక్రతీర్థ స్నానాలు అనంతరం స్వామికి ఇలా సంప్రోక్షణ పూజలు చేయడం సంప్రదాయమని అర్చకులు తెలిపారు.

రాష్ట్రంలో 274 రైల్వే ప్రాజెక్టులు ప్రారంభం



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

భువనేశ్వర్: ఒడిశాలో 274 రైల్వే ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభం కార్యక్రమం మంగళవారం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ కార్యక్రమంలో వర్చువల్ మాధ్యమంలో పాలుపంచుకున్నారు. ఈ ప్రాజెక్టుల్లో 162 ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ వ్యవస్థలు, 41 వన్ స్టేషన్ వన్ ఉత్పాదన (ఓఎస్‌ఓపీ) స్టాల్స్, 50 సౌర విద్యుత్ స్టేషన్లు, 5 గూడ్స్ షెడ్లు, 9 కొత్త లైన్, డబ్లింగ్, 3వ లైన్ ప్రాజెక్టులు, 4 ఆటో సిగ్నలింగ్ సిస్టమ్‌లు, 1 గతిశక్తి టెర్మినల్, 1 ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం, 1 రైల్ కోచ్ రెస్టారెంట్ ఉన్నాయి.

అందుబాటులోకి మరో వందేభారత్

రాష్ట్ర ప్రజలకు 3వ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పచ్చజెండా ఊపి భువనేశ్వర్ – విశాఖపట్నం మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను ప్రారంభించారు. అలాగే 9 కొత్తరైలు లైన్లు, డబ్లింగ్ మరియు 3వ లైన్ ప్రాజెక్టులను ప్రధానమంత్రి జాతికి అంకితం చేశారు. వీటిలో రూ.234 కోట్లు వెచ్చించి నిర్మించిన భద్రక్ – నెరుగుండి మార్గంలో 16.8 కిలోమీటర్ల హరిదాస్‌పూర్ – బొయిరీ 3వ లైన్, రూ.131 కోట్లు వ్యయంతో కొరాపుట్ – రాయగడ డబ్లింగ్ సెక్షన్‌లోని 14.6 కిలోమీటర్ల పొడవైన దామన్‌జోడి – బైగూడ రైలు లైన్, రూ.167 కోట్లు వెచ్చించి విజయనగరం – టిట్లాగఢ్ మధ్య నిర్మించిన 9.2 కిలోమీటర్ల సింగపూర్ రోడ్ – రాయగడ 3వ రైలు లైను, కొత్తవలస – కొరాపుట్ సెక్షన్‌లో రూ.123 కోట్ల వ్యయంతో సిమిలిగూడ – అరకు – గోరాపూర్ మార్గంలో 21.6 కిలోమీటర్ల డబుల్ లైన్, రూ.47 కోట్ల వ్యయంతో కోట – బొడ్డవార మధ్య 7.3 కిలోమీటర్ల డబల్ లైన్, రూ. 550 కోట్లతో బిలాస్‌పూర్ – ఝార్సుగుడ సెక్షన్‌లో 53 కిలోమీటర్ల పొడవున ఉన్న ఝార్సుగుడ – జమగా 4వ లైన్, బండాముండా – రాంచీ డబ్లింగ్ సెక్షన్‌లో రూ.61.73 కోట్లు వ్యయంతో బండాముండా లింక్ బి, లింక్ సి, రూ. 129.95 కోట్లు వెచ్చించి నవాగాంవ్ – ఓర్గా మధ్య 6.8 కిలోమీటర్ల డబ్లింగ్, రూ. 36.12 కోట్లతో నిర్మించిన నారాయణగడ్ – భద్రక్ మార్గంలో 3 కిలో మీటర్ల పొడవైన రాణితాల్ – రాణితాల్ (ఎల్) 4వ లైన్ ప్రాజెక్టులు ఉన్నాయి.



ఖుర్దారోడ్ రైల్వేస్టేషన్ ఆవరణలో పీఎంబీజేపీ కేంద్రం

రాష్ట్రంలో ఏకైక పీఎంబీజేపీకే

తూర్పు కోస్తా రైల్వే ఖుర్దారోడ్ రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం ప్రారంభించారు. రాష్ట్రంలో ఇది ఏకైక కేంద్రం కావడం విశేషం. దేశవ్యాప్తంగా ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఇటువంటి 50 కేంద్రాల్లో ఇది ఒకటి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కేంద్రం ప్రారంభోత్సవానికి జట్నీ నియోజకవర్గం ఎమ్మెల్యే సురేష్ కుమార్ రౌత్రాయ్, రాజ్యసభ సభ్యుడు ముజీబుల్లా ఖాన్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాజ్యసభ సభ్యుడు ఖుర్దారోడ్ రైల్వేస్టేషన్ పేరుకి జట్నీ జోడించి సవరించాలని అభ్యర్థించారు.

ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

బరంపురం: నగరంలో ఎస్పీ సార్వణ్ వివేక్ ఆదేశాలతో రెండు బెటాలియన్ల పోలీసుల బృందం మంగళవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించింది. అలాగే నగర ఫస్ట్‌గేట్ ప్రాంతంలో అర్ధరాత్రి వరకు వచ్చి పోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమానం వచ్చిన వాహనాలను పెద్ద బజార్ పోలీసు స్టేషన్‌కి తరలిస్తున్నారు. అదేవిధంగా వారెంట్ ఉన్నవారిని పట్టుకొని జైలుకి తరలిస్తున్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



శిక్షణ శిబిరంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ మహాజన్

రాయగడ: జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ కోరారు. స్థానిక అటానమస్ కళాశాలలో పోలింగ్ అధికారులకు శిక్షణ శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యాక అధికారులు అనుసరించాల్సిన విధానాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. పోలింగ్ రోజున ఓటింగ్ ప్రక్రియ ఎలా కొనసాగించాలి, అదేవిధంగా ఎప్పటికప్పుడు సమాచారాన్ని జిల్లా ఎన్నికల నిర్వహణ కార్యాలయానికి ఎలా చేరవేయాలి అనే అంశంపై వివరించారు.

ఈవీఎం, వీవీప్యాట్, కంట్రోల్ యూనిట్లు ఎలా పనిచేస్తున్నాయి, వాటి పనితీరు తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎం భాస్కర రైతా, డిప్యూటీ కలెక్టర్ సూర్యమణి భోయ్, తహసీల్దార్లు, బీడీవోలు పాల్గొన్నారు.

నబరంగ్‌పూర్ జిల్లాలో దారుణం

- చేతబడి పేరుతో వృద్ధురాలి హత్య

కొరాపుట్: చేతబడి చేసిందనే అనుమానంతో వృద్ధురాలిని దారుణంగా హత్య చేసిన అమానుష ఘటన నబరంగ్‌పూర్ జిల్లాలో చోటుచేసుకుంది. ఈ మేరకు జోరిగాం పోలీసుస్టేషన్ ఐఐసీ తపన్ కుమార్ సత్పతి ఘటన వివరాలు మంగళవారం ప్రకటించారు. కెందుగుడ గ్రామంలో బుతలి శాంత తన తల్లి రాయబరి శాంత (60)తో కలిసి నివాసముంటోంది. కానీ అవగాహన లేని కొందరు గ్రామస్తులు గత కొద్దికాలంగా రాయబరి శాంత చేతబడి చేస్తుందనే అనుమానంతో వేధింపులకు గురి చేసేవారు. ఇదే సమయంలో గ్రామానికి చెందిన సారథి శాంత, మాతిరి శాంత, కాజు శాంత, లఖి శాంత, పాలాడు శాంత, మాతిరి శాంతలు ఒక్కసారిగా మంగళవారం ఇంట్లోకి ప్రవేశించారు. తమకు చేతబడి చేస్తుందని దుర్భాషలాడుతూ, కొడుతూ రాయబరిని ఈడ్చుకుని వెళ్లిపోయారు. దీంతో బయపడిన ఆమె కుటుంబీకులు జోరిగాం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు కెందుగుడ గ్రామానికి వచ్చి రాయబరి కోసం గాలించారు. అయినా ఫలితం లేకపోవడంతో నిందితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. దీంతో తాము రాయబరిని కొట్టి హత్య చేసినట్లు నిందితులు అంగీకరించారు. తాము పూడ్చి పెట్టిన ప్రాంతం చూపించారు. వెంటనే పోలీసులు తవ్వి మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రపంచం ఎంతో అభివృద్ధి చెందుతున్నా ఇంకా మూఢ నమ్మకాలతో హత్యలు చేయడం దారుణమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం

చేపల వలకు చిక్కిన డ్రోన్



వలలో చిక్కిన డ్రోన్

భువనేశ్వర్: పూరీ తీరం బంగాళాఖాతంలో చేపల వేట సాగిస్తున్న మత్స్యకారుల వలకు డ్రోన్ చిక్కింది. ఇది విమానం ఆకారంలో భారీగా ఉంది. దీనిపై శక్ర టార్గెట్ అని రాసి ఉంది. పూరీ పెంటకోట తీరం మత్స్యకారుల వలలో మంగళవారం బయటపడింది. బలిహరచండి వద్ద సముద్రంలో చేపల కోసం పన్నిన వలలో డ్రోన్ చిక్కినట్లు మత్స్యకారులు తెలిపారు. సాగర తీరానికి దీనిని చేరదీయడంతో స్థానికులు, పర్యాటకులు, సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డ్రోన్‌లో వివిధ పరికరాలు అమర్చి ఉన్నట్లు గుర్తించారు. అయితే ఇది పని చేస్తుందో తెలియాల్సి ఉంది. అలాగే డ్రోన్ వివరాలు అస్పష్టంగానే ఉన్నాయి. రక్షణ శాఖ వినియోగిస్తుండగా ఈ డ్రోన్ సముద్రపు నీటిలో మునిగి ఉంటుందని భావిస్తున్నారు.

నేడు శ్రీముఖ సింగారం

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథుని శ్రీముఖ సింగారం బుధవారం జరుగుతుంది. రత్న వేదికపై కొలువుదీరిన మూల విరాటుల ముఖ అలంకరణ గోప్యంగా చేపడతారు. ఈ సందర్భంగా సాధారణ భక్తులకు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేయడం ఆచారం. దీనిలో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సుమారు 3 గంటల పాటు సర్వ దర్శనం నిలిపివేస్తారు. ద్వితీయ భోగ మండప సేవ తర్వాత అలంకరణ ప్రక్రియ ప్రారంభిస్తారు. ఈ ప్రక్రియ పూర్తిగా ముగిసేంత వరకు దర్శనం లభించదు.

పర్యాటక స్థలాల అభివృద్ధికి ప్రాధాన్యం



నందపూర్‌లో 32 మెట్ల సింహాసనం పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసన్



డుడుమా జలపాతం పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసన్

కొరాపుట్: జిల్లాలో పర్యాటక స్థలాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామని కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ తెలియజేశారు. స్థానిక డుడుమా జలపాతాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అక్కడికి వెళ్లడానికి ఉన్న రోడ్డుమార్గం ఆధునీకరించాలని, పర్యాటకులకు వసతి పెంచాలని అధికారులను సూచించారు. నందపూర్‌లో సూర్య వంశీయుల 32 మెట్ల రాజరికపు సింహాసనం పరిశీలించారు. చారిత్రాత్మక ఈ కట్టడం పరిరక్షణ అందరి బాధ్యతగా పేర్కొన్నారు. ఈ ప్రాంతం పర్యాటకంగా, సాంస్కృతికంగా ఎంతో కీలకమైనదన్నారు. ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక రంగంగా మార్చడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు పర్యాటక, రెవెన్యూ, అటవీ, పోలీసు శాఖల అధికారులు ఉన్నారు.

మిషన్ శక్తి కేఫ్ ప్రారంభం



కేఫ్ ప్రారంభిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రం మల్కన్‌గిరిలో మిషన్ శక్తి కేఫ్‌ను జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారి టంగులు, కలెక్టర్ పావార్ సేన్ ప్రకాష్‌లు సోమవారం ప్రారంభించారు. ఈ కేఫ్‌ను మల్కన్‌గిరి సమితికి చెందిన డీఎల్‌ఎఫ్ గ్రూప్ మహిళలకు అప్పగించారు. ఈ గ్రూప్‌లో 11 మంది మహిళలు ఉన్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. కేఫ్ ద్వారా తమకు గుర్తింపు వచ్చిందని తెలియజేశారు. సొంతంగా వ్యాపారం చేయడం ఆనందంగా ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో పీడీ డీఆర్‌డీఏ రత్నకార్ సాహు, మల్కన్‌గిరి సమితి అధికారి ప్రభతి జోడియా తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సమీపంలో యర్రచెరువు వద్ద రైల్వే డౌన్‌లైన్ ట్రాక్‌పై గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని జీఆర్‌పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ మంగళవారం తెలిపారు. గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని, ఐదడుగుల రెండు అంగుళాలు ఎత్తు, తెల్లని ఛాయతో ఆకుపచ్చ, గులాబి రంగు గడులు కలిగిన కాటన్ చీర, పచ్చ జాకెట్ ధరించి ఉన్న మృతురాలి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. సమీపంలో ఒడిశా గ్రామాలకు చెందిన మహిళగా భావించి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కేసు నమోదుచేసి మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించామని చెప్పారు.

'వందేభారత్'కు ఘన స్వాగతం

ఇచ్ఛాపురం/ఆమదాలవలస: భువనేశ్వర్– విశాఖ వందేభారత్ రైలుకు ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం ఘన స్వాగతం పలికి సిబ్బందిని ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం మరిన్ని రైళ్ల హాల్టింగ్ కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో రైల్వే మంత్రిని కలిసి విన్నవించగా.. విశాఖ– పలాస పాసింజర్ పొడిగింపు, వందేభారత్ రైళ్ల హాల్టింగ్ కేటాయించినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీలు బోర పుష్ప, సైల దేవదాస్, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, ఏఎంసీ బాబూరావు, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఆదిరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ చిట్టిబాబు, మున్సిపాలిటీ, మండల పార్టీ అధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్, రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు సాలిన ఢిల్లీ, ఆశి పురుషోత్తం, ముఖ్య నేతలు నీలాపు లక్ష్మి, మందాకిని, పిలక సంతోష్, చాట్ల తులసీదాస్, కాళ్ల సత్యం, సల్లా దేవరాజు, పొడుగు కామేష్, రాంజీ, పిలక విజయ్, బి.త్రినాథ్, నీలాపు ఢిల్లీ, వివేకానంద, దేవ, మోహన్‌దాస్, లోహిదాస్ పాల్గొన్నారు. అనంతరం శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు వందేభారత్ రైలుకు స్వాగతం పలికి ఇచ్ఛాపురం వరకు ప్రయాణించారు.



వందేభారత్ రైలుని జెండా ఊపి ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్స పిరియా విజయ

డ్రోన్ దీదీలకు అభినందనలు



డ్రోన్ దీదీలను అభినందిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



గాయత్రిని అభినందిస్తున్న కలెక్టర్

పోలాకి : స్వశక్తి–నారీశక్తి కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో ప్రధాని మోదీ ఎదురుగా డ్రోన్ ఎగురవేసిన అరసవల్లి గాయిత్రితో పాటు గుంటూరు నుంచి వర్చువల్‌గా అదే కార్యక్రమానికి హాజరైన మరో తొమ్మిది మంది డ్రోన్ దీదీలను ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అభినందించారు. మంగళవారం మబగాంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు కోసం పనిచేస్తున్నారని కితాబునిచ్చారు. వీరందరూ జిల్లా వాసులు కావటం, రాష్ట్రంలో వందమంది డ్రోన్‌దీదీల్లో నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన వారు ఆరుగురు ఉండటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రైనర్, కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శిమ్మ నేతాజీ, ఏడీఏ రవీంద్రభారతి, ఏవో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ అభినందనలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోలాకి మండలం సుసరాం గ్రామానికి చెందిన డ్రోన్ దీదీ అరసవిల్లి గాయత్రిని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా డ్రోన్ అందుకున్న సందర్భంగా ఆమెతో పాటు మిగతా డ్రోన్ దీదీలు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ కలిసి కలెక్టర్, జేసీ ఎం.నవీన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధ్రువపత్రాలు చూపించారు.

బొడ్డేపల్లి రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయం



రాజగోపాలరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ దుంపల లక్ష్మణరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బొడ్డేపల్లి రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయమని.. జిల్లాకు, కళింగ జాతికి ఎన్నో సేవలందించారని కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు (రామారావు) అన్నారు. మంగళవారం రాజగోపాలరావు 101వ జయంతి సందర్భంగా శ్రీకాకుళం నగరంలో సింహద్వారం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి దామోదర్‌రావు, చాపర వెంకటరావు, తిర్లంగి లోకనాథం, గురుగుబెల్లి పెంటయ్య, బొడ్డేపల్లి నాగేశ్వరరావు, ఏబీసీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి భద్రత మనందరి బాధ్యత



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రోడ్డు ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉండరాదని, యాక్సిడెంట్లు జరగకుండా రహదారి భద్రతా చర్యలు పాటించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. రవాణా, పోలీస్, జాతీయ రహదారి, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. శ్రీకాకుళం నవభారత్ బైపాస్ కూడలి వద్ద ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అక్కడ భూ సేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని ఎన్.హెచ్.ఏ.ఐ అధికారులను ఆదేశించారు. సింగుపురం అండర్ పాసేజ్‌లో నీరు నిల్వ ఉండరాదని, హైవేపై గుర్తించిన 33 బ్లాక్ స్పాట్‌లపై దృష్టి సారించాలన్నారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ హైవేలపై ప్రతి రెండు మండలాల పరిధిలో పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి ఎ.చంద్రశేఖర్ రెడ్డి, అదనపు ఎస్పీ ప్రేమ కాజల్, డీఆర్వో ఎం.గణపతిరావు, రవాణా శాఖ అధికారి గంగాధరరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ ప్రభాకర్, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, జిల్లా పంచాయతీ అధికారి కె.వెంకటేశ్వర్లు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి మోహనరావు, జెమ్స్ ఆర్‌ఎంఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్‌ఏ పదోన్నతులు

శ్రీకాకుళం న్యూకాలనీ : జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధన చేయడానికి అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించనున్నట్లు డీఈవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖాళీగా ఉన్న రోస్టర్ ప్రాప్తికి పదోన్నతులను కల్పించేందుకు ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ/జనరల్ బీఈడీతోపాటు రెండేళ్ల స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డిప్లమో ఇతర అర్హతలు కలిగిన ఎస్‌జీటీ టీచర్లు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

అర్హతలు కలిగిన ఎస్‌జీటీలు ఈ నెల 13 ఉదయం 10 గంటలలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి తమ దరఖాస్తులను, ఒరిజినల్ సేవా పుస్తకం(సర్వీస్ రిజిస్ట్రార్)తో హాజరుకావాలని డీఈవో సూచించారు.

ఈఎస్ఎంఎస్ యాప్‌పై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఫ్లయింగ్ స్క్వాడ్, నిఘా బృందాల ద్వారా స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల రియల్ టైమ్ డేటాను ఎన్నికల కమిషన్‌కు ఎప్పటికప్పుడు చేరవేయడానికి వినియోగించే ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ (ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్–ఈఎస్ఎంఎస్) యాప్‌పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఎన్నికల నోడల్ అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ జి.ఆర్.రాధికతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌లో సరైన వివరాలను నమోదు చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, గంజాయి, సారా, మద్యం అక్రమ రవాణా జరగకుండా నిఘా పెంచామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, అదనపు ఎస్పీ ప్రేమకాజల్, జిల్లా అటవీ శాఖ అధికారి నిషాకుమారి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాణీ మోహన్, సీపీఓ ప్రసన్నలక్ష్మి, ట్రెజరీ డీడీ రవికుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్, డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, పోస్టల్ సూపరింటెండెంట్ శివకుమార్, సెబ్ అధికారి తిరుపతి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు, ఔషధ నియంత్రణ శాఖ ఏడీ చంద్రరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దంపతుల ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రామకృష్ణ, విమల

చీపురుపల్లి: అప్పులు ఎక్కువయ్యాయనే బాధను తట్టుకోలేక మనస్తాపం చెందిన చీపురుపల్లి పట్టణానికి చెందిన దంపతులు మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రాజాం రోడ్‌లో నివాసం ఉంటున్న ఎస్.రామకృష్ణ, విమల దంపతులు అప్పులపాలయ్యారు. ఈ నేపథ్యంలో ఆ దంపతులు కొన్నాళ్లపాటు వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. సోమవారం రాత్రి వారు తిరిగి చీపురుపల్లిలోని తమ ఇంటికి చేరుకున్నారు. ఇంతలో ఏం జరిగిందో తెలియదు గానీ మంగళవారం ఉదయాన్నే దంపతులు బ్లేడుతో పీక కోసుకుని ఆత్మహత్యాయానికి పాల్పడ్డారు. ఈ సంఘటనను స్థానికులు గుర్తించి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాని(సీహెచ్‌సీ)కి తరలించగా అక్కడి వైద్యులు చికిత్స అందించారు. దీంతో ఆ దంపతులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై కె.కిరణ్‌కుమార్‌నాయుడు స్పష్టం చేశారు.

మహిళ ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: నగరంలోని కోరుకొండ ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న గంటాన సంతోషి (33) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై రూరల్ పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా సంతోషి అనారోగ్యంతో మతిస్థిమితం లేక బాధపడుతోంది. ఈ నేపథ్యంలో కన్నవారింటి వద్దనే ఉంటూ ట్రీట్‌మెంట్ తీసుకుంటోంది. అయితే అనారోగ్యం కుదుటపడకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వరండా వద్దనున్న ఐరన్ పిల్లర్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. భర్త కోటేశ్వరరావు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృతురాలి తల్లి రవ్వ బంగారమ్మ ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై వాసుదేవ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తెర్లాం: ముందు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. మంగళవారం రాత్రి ఈ ప్రమాదం తెర్లాం మండలంలోని పెరుమాళి సమీపంలో జరిగింది. దీనికి సంబంధించి స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజాం నుంచి రామభద్రపురం వైపు ప్రయాణికులతో ఆటో వస్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఆటో బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మండలంలోని చినపాలవలసకు చెందిన చెల్లవరపు తాతబాబు(40) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న మండలంలోని వి.చిన్నయ్యపేటకు చెందిన గుణుపూరు సూర్యనారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం రాజాంలోని కేర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు తాతబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటోను ఢీకొన్న లారీ రాత్రి సమయం కావడంతో సంఘటనా స్థలంలో ఆపకుండా వెళ్లిపోయింది. ప్రమాద వార్త తెలుసుకున్న తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. బాధిత కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంజేబీపీ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో గల మహాత్మా జ్యోతిబాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 5వ తరగతి (ఆంగ్లమాధ్యమం)లో ప్రవేశాలకు బీసీ, ఎస్సీ,ఎస్టీ, ఈబీసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కన్వీనర్ ప్రిన్సిపాల్ మూకల పెంటయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 9 నుంచి 11 సంవత్సరాల వయసు గల బీసీ, ఈబీసీ, ఇతర విద్యార్థులు, 9 నుంచి 13 సంవత్సరాల వయస్సు గల ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్. ఇన్‌లో వంద రూపాయలు చెల్లించి మార్చి మార్చి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, రిఫరెన్స్ నంబర్ ఉపయోగించి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష 27.4.2024న నిర్వహించనున్నామని పేర్కొన్నారు. సాలూరు బాలికల పాఠశాలలో 80 సీట్లు, కురుపాం బాలురు పాఠశాలలో 40 సీట్లు, పార్వతీపురం బాలికల పాఠశాలలో 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

ముద్దాయికి జైలు, జరిమానా

దత్తిరాజేరు: బైక్‌ల దొంగతనం కేసుల్లో దొరికిపోయిన ముద్దాయికి 5నెలల జైలు శిక్ష, రూ.ఐదు వందలు జరిమానా విధించినట్లు పెదమానాపురం ఎస్సై శిరీష మంగళవారం తెలిపారు. పార్వతీపురం మండలంలోని పిన్నింటి రామునాయుడు వలసకు చెందిన మరిపి గోవిందరావు దొంగతనం చేసినట్లు రుజువు కావడంతో గజపతినగరం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పై విధంగా తీర్పు చెప్పారని ఎస్సై చెప్పారు.



కార్యక్రమానికి హాజరైన మహిళలు

మహిళా సాధికారత

జగనన్నతోనే సాధ్యం

- చేయూత చెక్కులు పంపిణీ చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



లబ్ధిదారులకు చేయూత మెగా చెక్కును అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం రూరల్: గడిచిన 2019 ఎన్నికల్లో భాగంగా అక్క చెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో అనేక పథకాలు అందించి, మహిళా సాధికారతకు కృషి చేశారని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. ఈ మేరకు విజయనగరంలోని ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్ సమీపంలో ఉన్న మైదానంలో నియోజకవర్గం పరిధిలో 45 ఏళ్లు నిండి 60 ఏళ్ల లోపు వయస్సు కలిగిన మహిళలకు ఇటీవల మంజూరైన వైఎస్సార్ చేయూత పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మహిళలనుద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మలను ఆర్థికంగా పరిపుష్టం చేయాలనే ధ్యేయంతో వైఎస్సార్ ఆసరా పథకంతో డ్వాక్రా రుణమాఫీ చేశారని, సున్నా వడ్డీ పథకం డబ్బులు ఏటా వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. వైయస్సార్ చేయూత పథకంలో భాగంగా 45 ఏళ్లు నిండిన ఒక్కో మహిళకు ఏడాదికి రూ. 18,750 నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనన్నారు.

గ్రామాల్లో బీటీ రోడ్లు

విజయనగరం నియోజకవర్గంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో బీటీ రోడ్లు నిర్మించి ప్రజల కష్టాలు తొలగించామని చెప్పారు. బడ్డుకొండపేట, గొల్లలపేట, గుండాలపేట, కొత్తకాపుపేటకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. రాకోడు గ్రామానికి రోడ్డు నిర్మించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, కోరుకొండ నుంచి హరిజన కొత్తూరుకు ఏర్పాటు చేసిన రోడ్డుతో రెండు గ్రామాల మధ్య దూరం తగ్గి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగాయని చెప్పారు. 13 గ్రామ సచివాలయాల పరిధిలో లక్షలాది రూపాయలతో సచివాలయ భవనాలు, వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాలు, రైతుభరోసా కేంద్రాలు, నాడు-నేడుతో బడులు, ఆసుపత్రులను అభివృద్ధి చేశామన్నారు. అలాగే ఐదేళ్లలో పట్టణ రూపురేఖలు మార్చగలిగామని వివరించారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని పేర్కొన్నారు. అనంతరం రూ. 27 కోట్ల చేయూత చెక్కులను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్వీవీ రాజేష్, జెడ్పీటీసీ కెల్ల శ్రీనివాసరావు, నగర పాలక కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, విజయనగరం ఎంపీడీవో గంటా వెంకటరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఆశపు వేణు, పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, మండల, కార్పొరేషన్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సుమారు 5 వేల మంది చేయూత లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ ఆస్తుల పరిరక్షణకు చర్యలు

- అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ



తారాపురంలో ఆక్రమణదారులతో చర్చిస్తున్న దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ

రామభద్రపురం: దేవదాయ శాఖకు చెందిన ఆస్తుల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఆశాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ అన్నారు. రామభద్రపురం మండలంలోని తారాపురం గ్రామంలో ఉగ్రేశ్వరస్వామికి చెందిన స్థలాన్ని పలువురు ఆక్రమించుకున్నారని ఆలయ నిర్వాహకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆమె ఆ గ్రామానికి పరిశీలనకు వచ్చారు. ఈ క్రమంలో ఆక్రమణదారులతో ఆమె చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తారాపురం గ్రామంలో ఉగ్రేశ్వర స్వామి ఆలయాన్ని ఆనుకుని దాదాపు 23 సెంట్ల స్థలం ఉండగా ఆ స్థలాన్ని పలువురు గ్రామస్తులు దాదాపు 15 ఏళ్ల క్రితం ఆక్రమించుకుని పశువుల శాలలు నిర్మించుకున్నారన్నారు. ఆక్రమణలు తొలగించాలని నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో రెవెన్యూ శాఖ అధికారుల సహకారంతో తాను పరిశీలించి ఆక్రమణ దారులతో చర్చలు జరపడంతో 10 రోజుల్లో ఆక్రమణలు తొలగించేందుకు అంగీకరించారని తెలిపారు. జిల్లాలో దేవదాయశాఖకు సంబంధించి సుమారు 11వేల ఎకరాల భూములు ఉన్నాయన్నారు. ఆ భూములను పరిరక్షించే బాధ్యత ఆయా ఆలయాల నిర్వాహకులదేనని స్పష్టం చేశారు. దేవాదాయ శాఖ భూములు ఏ విధమైన అనుమతులు లేకుండా ఆక్రమిస్తే ఆ వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ బొబ్బిలి ఇన్‌స్పెక్టర్ ఎన్.రాజకుమారి, ఎస్సై జ్ఞానప్రసాద్, ఏఎస్సైలు చిన్నారావు, అప్పారావులు ఆమె వెంట ఉన్నారు.

పోలమాంబను దర్శించుకున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, పోలమాంబ అమ్మవారి ఎనిమిదవజాతర మక్కువ మండలంలోని శంబర గ్రామంలో మంగళవారం జరిగింది. సుదూర ప్రాంతాలనుంచి భక్తులు గ్రామానికి చేరుకుని, గ్రామంలోని చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామం పొలిమేరలో ఉన్న వనంగుడిలో పెదపోలమాంబ అమ్మవారిని దర్శించుకుని ఆలయం వెనుక ఉన్న వేపచెట్టుకు పూజలు చేశారు. కోళ్లు, చీరలు మొక్కుబడులుగా చెల్లించారు. జాతరకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం మంచినీటి సౌకర్యం, లడ్డూ, పులిహోర ప్రసాదాలను ఈవో వి.వి సూర్యనారాయణ ఏర్పాటుచేశారు. ఎస్సై పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు జాతరలో బందోబస్తు నిర్వహించారు.

రెండురోజుల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు

- కలెక్టర్ నాగలక్ష్మి



ప్రచార పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ కార్తీక్



ఎన్నికల కంట్రోల్ రూమ్

విజయనగరం అర్బన్: ఎన్నికలకు సంబంధించి పాత ట్రెజరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో అన్ని రకాల ఏర్పాట్లను రెండు రోజుల్లో పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆమె జేసీ కార్తిక్, డీఆర్‌ఓ అనితతో కలిసి కంట్రోల్ రూమ్‌ను మంగళవారం సందర్శించారు. కంట్రోల్ రూమ్‌లో ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, 1950 టోల్ ఫ్రీ, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వార్తల మానిటరింగ్ తదితర సేవలకు సంబంధించి పలు శాఖల అధికారులు, సిబ్బందిని నియమించారు. పోలింగ్ డే రోజున వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. అందుకు అవసరమైన టీవీలు, కంప్యూటర్లు, ప్రింటర్లు, జిరాక్స్, ఇంటర్నెట్, మైక్ సిస్టం, టేబుళ్లు, కుర్చీలు తదితర సదుపాయాలన్నీ రెండు రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదే విధంగా కలెక్టరేట్ లోపల ఉన్న చెత్తను తొలగించి మొత్తం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని వెంటనే మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడాలని డీఆర్‌ఓకు సూచించారు. ఈ సందర్భంగా ఓటు విలువను తెలిపే పలు స్లోగన్ల పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ వెంట సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, సీపీఓ పి.బాలాజీ, జిల్లా పరిషత్ సీఈఓ రాజ్‌కుమార్, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డీపీఆర్‌ఓ రమేష్, ఎన్నికల విభాగపు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ జంక్షన్‌లో బాబు జగ్జీవన్ రామ్

- విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జిల్లా కేంద్రం, విద్యలనగరం విజయనగరం సిగలో మరో మహనీయుడి విగ్రహం ఏర్పాటు కానుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నగర అభివృద్ధి, సుందరీకరణ పనులు గతంలో ఎన్నడూ లేని విధంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తాజాగా నగరంలోని ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్ వి.విజయలక్ష్మి తదితరులు విగ్రహ ఏర్పాటుకు మంగళవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అంతకుముందు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలు భావితరానికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు. దేశానికి ఉత్కృష్టమైన సేవలను అందించిన మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అందుకోసమే ఆ మహానేతల విగ్రహాలను నగరంలో నెలకొల్పుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ డివిజన్‌ల కార్పొరేటర్‌లు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసైన వ్యక్తి మృతి

భోగాపురం: స్థానిక పంచాయతీ మధుర గ్రామమైన అప్పన్నపేట సమీపంలో ఉరచెరువు వద్ద పొదల్లో మద్యానికి బానిసై ఓ వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రామచంద్రపేట గ్రామానికి చెందిన నౌడగల అప్పన్న(48) మద్యానికి బానిసై నిత్యం మద్యం తాగుతూ ఉండేవాడు. అప్పన్నకు భార్య అప్పయ్యమ్మతో పాటు కుమారుడు రమణ ఉన్నారు. నాన్నా..ఎందుకు ప్రతిరోజూ ఎక్కువగా మందు తాగుతావు. నీ ఆరోగ్యం పాడైపోతుందని ఈనెల 3న తండ్రి అప్పన్నను కుమారుడు మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన అప్పన్న మరునాడు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి భర్త ఇంటికి రాకపోవడంతో భార్య అప్పయ్యమ్మకు అనుమానం వచ్చి బంధువులతో కలిసి చుట్టూ పక్కల ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. అయితే సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని అప్పన్నపేట సమీపంలో ఉరచెరువు వద్ద పొదల్లో మృతదేహం ఉండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చనిపోయిన వ్యక్తిని రామచంద్రపేట గ్రామానికి చెందిన అప్పన్నగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

సర్కారు ఆస్పత్రిలో సకల సదుపాయాలు

- ఆస్పత్రుల బలోపేతంపై దృష్టిపెట్టిన ప్రభుత్వం
- ఓపీ విభాగం, ఆపరేషన్ థియేటర్స్ ఆధునికీకరణ
- మెరుగుపడిన వైద్యసేవలు



కొత్తపేట యూపీహెచ్‌సీ



సర్వజన బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లో బ్లడ్ కల్చర్ పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



సంతపేట యూపీహెచ్‌సీ ల్యాబొరేటరీలో వైద్యపరికరాలు



సర్వజన ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు బలోపేతమయ్యాయి. విజయనగరం జిల్లాలో 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)లు, 18 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(యూపీహెచ్‌సీ)లు, రెండు ఏరియా ఆస్పత్రులు, 5 సామాజిక ఆరోగ్య కేంద్రా(సీహెచ్‌సీ)లు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఉన్నాయి. వాటన్నింటిలో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించింది. రోగులకు సేవలు అందించడానికి వీల్‌చైర్స్, డెలివరీ టేబుల్స్, డ్రగ్ ట్రాలీలు, పేషెంట్ వెయిటింగ్ చైర్స్, బీరువాలు, డ్రగ్ రాక్స్ వంటి వసతులను కల్పించింది.

ల్యాబ్‌లు, థియేటర్స్‌లో అత్యాధునిక పరికరాలు

పీహెచ్‌సీనుంచి జిల్లా ఆస్పత్రి వరకు అన్ని ఆస్పత్రుల్లో ల్యాబొరేటరీలు, ఆపరేషన్ థియేటర్స్‌ల్లో అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేసింది. ఆపరేషన్ థియేటర్స్‌లో ఓటీ లైట్స్, ఓటీ టేబుల్స్, సెక్షన్ ఆపరేటర్స్, మల్టీ పారామానిటర్స్ వంటివి ఏర్పాటు చేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉండే ల్యాబొరేటరీల మాదిరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలు కల్పించారు. జిల్లా స్థాయిలో జరిగే వైద్య పరీక్షలు సైతం పీహెచ్‌సీ స్థాయిలో జరుగుతుండ డంతో రోగులకు స్థానికంగానే వైద్యసేవలు అందుతున్నాయి.

ఐసీయూల బలోపేతంతో తగ్గిన రిఫరల్స్

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న ఐసీయూను ప్రభుత్వం బలోపేతం చేయడంతో రిఫరల్స్ తగ్గాయి. సెంట్రలైజ్డ్ ఆక్సిజన్ సిస్టంతో పాటు వెంటిలేటర్స్ సౌకర్యం ఏర్పాటు చేయడంతో అత్యవసర కేసులకు స్థానికంగానే చికిత్స అందుతోంది. 30 పడకల ఐసీయూ సర్వజన ఆస్పత్రిలో ఉంది. ఎమర్జెన్సీ టెక్నీషియన్స్ అందుబాటులోకి రావడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో కూడా రోగుల ప్రాణాలను వైద్యులు కాపాడ గలుగుతున్నారు.

అందుబాటులోకి స్కానింగ్ సేవలు

కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండే ఎంఆర్ఐ, సి.టి స్కాన్ సేవలు విజయనగరం సర్వజన ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చాయి. డిజిటల్ ఎక్స్‌రే కూడా అందుబాటులో ఉంది. ఎంఆర్ఐ, సి.టి స్కాన్‌కు రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్‌లో ఫీజు వసూలు చేస్తే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉచితంగానే ఈ సేవలు అందిస్తారు.

అందుబాటులో బయాప్సీ, ఎఫ్ఎన్ఏసీ, పాప్సీమిర్ సేవలు

వ్యాధి నిర్ధారణలో అత్యంత కీలకమైన బయాప్సీ, ఎఫ్ఎన్ఏసీ, పాప్సీమిర్ పరీక్షలు కూడా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. కేన్సర్ నిర్ధారణ కూడా జరుగుతోంది.

అన్ని రకాల మందులు ఇచ్చారు



నాకు బీపీ ఉంది. తల తిరుగుతోందని విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వెళ్లాను. అక్కడ బీపీ పరీక్ష చేసి తగ్గడానికి అన్ని రకాల మందులు ఇచ్చారు. డాక్టర్లు చాలా బాగా చూశారు.

– పొట్టుపు రెడ్డి దేముడు, పెదవేమలి గ్రామం

పీహెచ్‌సీలో బాగా చూస్తున్నారు



మా బంధువుకు జ్వరం వచ్చిందని గంట్యాడ పీహెచ్‌సీకి తీసుకుని వెళ్లాను. అక్కడి వైద్యుడు వైద్య పరీక్షలు చేశారు. జ్వరం తగ్గడానికి మందులు అందించారు. మూడు రోజులు వాడిన తర్వాత జ్వరం తగ్గింది.

– పి. రామకృష్ణ, చంద్రంపేట గ్రామం

ఆస్పత్రుల్లో మౌలిక వసతులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల మౌలిక వసతులను ప్రభుత్వం కల్పించింది. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో చాలావరకు సేవలు అందడం వల్ల జిల్లా ఆస్పత్రిపై ఒత్తిడి తగ్గింది.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

ఐదేళ్లలో రూ.115 కోట్ల ఖర్చు

2019 నుంచి ఇప్పటివరకు ఆస్పత్రులకు భవనాల నిర్మాణం, ఆధునికీకరణకు రూ.35 కోట్లు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ నిర్మాణానికి రూ.50 కోట్లు, పీహెచ్‌సీ భవనాల నిర్మాణం, ఆధునికీకరణకు రూ.40 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది.

ఏటా లక్షలాది మంది రోగులకు సేవలు

జిల్లాలో ఉన్న పీహెచ్‌సీ, సీహెచ్‌సీ,ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో లక్షలాది మంది బాధితులకు ఏటా సేవలు అందిస్తున్నారు. ఏడాదికి 10 లక్షల మంది ఓపీ, 2లక్షల నుంచి 2.50 లక్షల వరకు ఇన్‌పేషేంట్లు చికిత్స పొందుతున్నారు.

రైల్వే ప్రయాణికులకు ఉత్తమ సేవలు

- విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్
- విశాఖ-భువనేశ్వర్ వందేభారత్ రైలుకి ఘనస్వాగతం



1వ ప్లాట్‌ఫాం మీదకు వచ్చిన రైలును చూస్తున్న ప్రజాప్రతినిధులు

విజయనగరం టౌన్: కేంద్ర ప్రభుత్వ సహకారంతో జిల్లాలో గత ఐదేళ్ల కాలంలో పెద్ద ఎత్తున రైల్వే సేవలు, వసతులు కల్పించామని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. విశాఖ-భువనేశ్వర్ మధ్య కొత్తగా ఏర్పాటుచేసిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఘనస్వాగతం పలికారు. ప్రధానిమోదీ వర్చువల్‌గా రైలును ప్రారంభించగా, విశాఖ నుంచి విజయనగరానికి ఉదయం 10.37 గంటలకు చేరుకుంది. ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్‌బాబు, రఘువర్మ, రైల్వే అధికారులు ఘనస్వాగతం పలికారు. వన్‌స్టేషన్- వన్‌ప్రొడక్ట్‌ను ఎంపీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర రైల్వే మంత్రి, రైల్వే అధికారులను కలిసి విన్నవించిన ఫలితంగా చీపురుపల్లి రైల్వే వంతెన రూ.13 కోట్లతో నిర్మాణం పూర్తికావచ్చిందని, రూ. 3కోట్లతో పాదచారుల వంతెన మంజూరైందన్నారు. విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి రైల్వేస్టేషన్‌ల ఆధునీకరణ పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కామర్స్ అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కామర్స్ సబ్జెక్టు బోధనకు అతిథి అధ్యాపకుల నియమకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బలగ శుభ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక గంట తరగతి బోధనకు రూ.400 గౌరవ వేతనంతో తాత్కాలిక ప్రాతిపదికపై బోధించాలన్నారు. అభ్యర్థులు ఎంకాంలో 55 శాతంతో ఉత్తీర్ణులై, ఏపీసెట్/యూజీసీ నెట్/పీహెచ్‌డీ విద్యార్హతతో పాటు బోధనానుభవం, కంప్యూటర్ వినియోగంలో పరిజ్ఞానం ఉన్న వారికి అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అర్హత ధ్రువపత్రాలతో ఈ నెల 15వ తేదీన ఉదయం 9 గంటలకు నేరుగా కళాశాలకు హాజరుకావాలని సూచించారు.

న్యాయవాదుల సంఘ ఎన్నికల షెడ్యూల్ విడుదల

- 28న పోలింగ్ ప్రక్రియ

సాక్షిప్రతినిధి, విజయనగరం: ప్రతిష్టాకరమైన జిల్లా కేంద్ర న్యాయవాద సంఘ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల అధికారులు మంగళవారం విడుదల చేశారు. ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 25న ఉప సంహరణ, 28న పోలింగ్ ప్రక్రియ ఉంటుందని ఎన్నికల అధికారులు పి.శ్రీరామ్మూర్తి, కె.రవిబాబు వెల్లడించారు. అదేరోజు ఫలితాలను ప్రకటిస్తామన్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులతో పాటు కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ, గ్రంథాలయ కార్యదర్శితో పాటు మహిళా ప్రతినిధి పదవులకు ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు ఏడాది పాటు విధులు నిర్వహిస్తారన్నారు. సుమారు 600 మంది ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు సీనియర్లు, జూనియర్‌లు తమకు సహకరించాలని కోరారు.